అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 193. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.18.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## విజయంతో ఆరంభం


ఢిల్లీ : అమృత్ తెలంగాణ:డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా 2025 సీజన్‌ను గెలుపు త్రో తో ఆరంభించాడు. దక్షిణాఫ్రికాలోని పోచెఫ్‌స్ట్రామ్‌లో జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ చాలెంజర్ ఈవెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్.. 84.52 మీటర్ల త్రో తో మొదటి స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో ఆరుగురు పోటీపడగా నీరజ్‌కు అగ్రస్థానం.. దక్షిణాఫ్రికాకే చెందిన డౌ స్మిత్ (82.44 మీటర్లు) రెండో స్థానం దక్కించుకున్నాడు. వచ్చే నెల 16 నుంచి దోహాలో జరుగబోయే డైమండ్ లీగ్ సన్నాహకాల్లో ఉన్న నీరజ్.. ఈ సీజన్‌లో 90 మీటర్ల మార్కును అందుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు.

## 22 మంది మావోయిస్టులు అరెస్ట్

రాయ్‌పూర్ :అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నుండి మొత్తంగా 22 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి గురువారం ప్రకటించారు. వారి నుండి పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. సిఆర్‌పిఎఫ్‌కి చెందిన కోబ్రా, స్థానిక పోలీసుల బృందం సంయుక్తంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టెక్మెట్ల గ్రామ సమీపంలోని అడవిలో మావోయిస్టులలో దిగువస్థాయి కేడర్‌కి చెందిన ఏడుగురిని మంగళవారం అరెస్ట్ చేశామని ఆ అధికారి తెలిపారు. అదే ప్రాంతంలోని జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామం నుండి మరో ఆరుగురిని, నెలస్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందకర్కా గ్రామం నుండి తొమ్మిది మంది కార్యకర్తలను అరెస్ట్ చేశామని అన్నారు. వీరంతా 19 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్నారని అన్నారు. వీరి నుండి జెలెటిన్‌స్టిక్స్, టిఫిన్‌బాక్స్ బాంబులు, డిటోనేటర్లు, విద్యుత్ వైర్లు, బ్యాటరీలు, కరపత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆ అధికారి తెలిపారు.

# రేవంత్ రెడ్డి లాంటి పిచ్చి సన్నాసి తప్ప.. చెరువును ఎవడూ తాకట్టు పెట్టడు: కేటీఆర్


హైదరాబాద్:అమృత్ తెలంగాణ: రేవంత్ చేసిన 10 వేల కుంభకోణం మీద తాము చెప్పిందే నిజమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హెచ్‌సీయూ భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని వారం రోజుల క్రితమే చెప్పామన్నారు. సుప్రీంకోర్టు సాధికార కమిటీ హెచ్‌సీయూ భూములపై ఆర్థిక పరమైన అవకతవకలు, ఉద్దేశపూర్వకంగా చేసిన అరాచక పర్వంపై స్పెషలైజ్డ్ ఏజెన్సీ ద్వారా స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ రూ.10 వేల కోట్ల కుంభకోణం బయటకు రావాలంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆర్బీఐ కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'బుధవారం నాటి సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా ఉన్నాయి. అధికార మదంతో విర్రవీగుతూ.. మేమే నియంతలం, రారాజులం అని అనుకుంటున్న వారికి నిన్నటి సుప్రీం కోర్టు తీర్పు ఒక గుణ పాఠం. సుప్రీంకోర్టు ఆదేశాలతో వేరే ముఖ్యమంత్రి అయితే రాజీనామా చేసేవాడు. కానీ రేవంత్ రెడ్డికి సిగ్గు లేదు కాబట్టి దులుపుకొని పోతున్నడు. హెచ్‌సీయూ భూముల కోసం పోరాడిన విద్యార్థులు, సామాజికవేత్తలకు అభినందనలు. సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు. కంచగచ్చిబౌలి భూమి వర్సిటీ ఆధీనంలో ఉన్నదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సాధికార కమిటీ చెప్పింది. ఆ భూములపై సుప్రీంకోర్టు చొరవ తీసుకోవాలని సూచించింది.



10 వేల కోట్ల కుంభకోణం బయటకు రావాలంటే పూర్తిస్థాయి విచారణ జరగాలి. ప్రధాని మోదీ ఒక్కోచోట ఒక్కోరకంగా మాట్లాడుతారు. రాష్ట్రంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ నడుస్తున్నదని అన్నారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. సెంట్రల్ వర్సిటీ భూముల్లోకి ప్రభుత్వం బుల్డోజర్లను పంపి విధ్వంసం సృష్టిస్తున్నదని మోదీ చెప్పారు. హెచ్‌సీయూ భూములపై రేవంత్ రెడ్డి చేసిన కుంభకోణంపై మోడీ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు?. సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీ హెచ్‌సీయూ భూములపై కుంభకోణం జరిగిందని, విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని నిన్న నివేదిక ఇచ్చింది. ఈ కుంభకోణంపై మా పార్టీ తరపున అన్ని ఆధారాలతో సహా లేఖ రాశాం. మోదీకి చిత్తశుద్ధి ఉంటే ఈ కుంభకోణంపై విచారణకు ఆదేశించాలి. లేదంటే మోడీ ప్రభుత్వం మాటల ప్రభుత్వమని మేమే కాదు తెలంగాణ ప్రజలు కూడా అనుకుంటారు. కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి. ప్రభుత్వ ఉత్తర్వులను టీజీఐఐసీ తుంగలో తొక్కిందని సాధికార కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. చెరువలను కూడా తనఖా పెట్టారని నివేదికలో పేర్కొంది. రేవంత్ రెడ్డి లాంటి పిచ్చి సన్నాసి తప్ప చెరువును ఎవడు తాకట్టు పెట్టడు. రేవంత్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు బీజేపీ నేతలు ఎందుకు ప్రయత్నిస్తున్నారని' ప్రశ్నించారు. వన్యప్రాణులు చనిపోయాయంటే ఏఐ వీడియోలంటూ కేసులు పెట్టారు. రేవంత్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు, పోలీసుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం. కంచ గచ్చిబౌలి భూములపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. ఆర్థిక దోపిడీ, పర్యావరణపై దాడి విషయంలో ప్రధాని మోదీ స్పందించాలి. చిత్తశుద్ధి ఉంటే రేవంత్ రెడ్డి బయటకు వచ్చి మాట్లాడాలి. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై 'రేవంత్ రెడ్డి ఐదేండ్లు అధికారంలో ఉండాలి. ఈ దిక్కుమాలిన ప్రభుత్వాన్ని కూలగొట్టే కర్మ మాకు లేదు. ప్రజలకు కోపం వస్తే బంగ్లాదేశ్‌లో లాగా వాళ్లే రోడ్డెక్కి ప్రభుత్వాన్ని తొక్కుతారు. పెద్ద పెద్ద నియంతలే కొట్టుకుపోయారు.. రేవంత్ రెడ్డి ఎంత?. ప్రభాకర్ రెడ్డి చెప్పింది అక్షర సత్యం. మా దగ్గర కూడా ప్రజలు వచ్చి ప్రభుత్వాన్ని కూల్చేయాలని చెప్తున్నారు. కానీ ఈ ఐదేండ్లు రేవంత్ రెడ్డే అధికారంలో ఉండాలి. అప్పుడే ఇంకో 20 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలంటే భయపడతారు. ఫార్ములా-ఈ కేసులో మంత్రిగా విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నప్పుడు తాను ఎప్పుడూ అధికారులను బలిపశువులను చేయలేదు. రాజకీయం అంటే అట్ల చేయాలి.. అంతే కానీ మంచి జరిగితే నాది చెడు జరిగితే అధికారుల మీద నెట్టే కుసంస్కారం మా పార్టీకి లేదు' అని కేటీఆర్ అన్నారు.

# చిరంజీవి, బాలకృష్ణతో ఇక సినిమాలు చేయనని తేల్చి చెప్పిన విజయశాంతి

అమృత్ తెలంగాణ: స్టార్ హీరోల సరసన కథానాయికగా నటిస్తూనే అడపాదడపా లేడి ఓరియెంటెడ్ చిత్రాలలో నటించి లేడి సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకుంది విజయశాంతి. అప్పట్లో స్టార్ హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. యాక్షన్ సినిమాలకి కేరాఫ్ అడ్రెస్‌గా కూడా మారింది. తెరపై ఖాకీ పాత్రలకే వన్నె తీసుకొచ్చిన విజయశాంతి యాక్షన్ సన్నివేశాల కోసం ఎలాండి డూప్ లేకుండా నటించేవారు. ఆమె వయసు 60కి సమీపిస్తున్నా కూడా అడపాదడపా సినిమాలలో నటిస్తూ మెప్పిస్తుంది. ఆ మధ్య మహేష్ బాబుతో సరిలేరు నీకెవ్వరు చిత్రంలో నటించిన విజయశాంతి ఇప్పుడు అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రంలో నటించింది. కల్యాణ్ రామ్ హీరోగా నటించిన ఈ చిత్రం ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే విజయశాంతి తన కెరీర్‌లో ఎక్కువగా మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణలతో కలిసి నటించింది. వీరి కాంబోలో వచ్చిన చాలా చిత్రాలు సూపర్ హిట్‌గా కూడా నిలిచాయి. అయితే ఇప్పుడు తిరిగి బాలకృష్ణ, చిరంజీవిలతో కలిసి నటించే ఛాన్స్ ఉందా అనే ప్రశ్న విజయశాంతికి ఎదురు కాగా, ఇకపై తాను వారితో సినిమాలు చేయనని సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చింది.



ఎమ్మెల్సీగా ఎంపికైన నేపథ్యంలో బాధ్యతలు పెరిగాయి. ప్రజా కార్యక్రమాలతో బిజీగా ఉంటాం కాబట్టి మున్ముందు సినిమాలు చేసే అవకాశం ఉండదు. ఇక చిరంజీవి,బాలకృష్ణలతో నటించే అవకాశమే లేదు అని తేల్చేసింది లేడి సూపర్ స్టార్. విజయశాంతి.. చిరంజీవి కాంబోలో వచ్చిన గ్యాంగ్ లీడర్, యముడికి మొగుడు, స్వయం ఖుషి, పసివాడి ప్రాణం, కొండవీటి దొంగ, కొండవీటి రాజా, మెకానిక్ అల్లుడు, అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, మహానగరంలో మాయగాడు, స్టూవర్ట్ పురం పోలీస్ స్టేషన్, రుద్రవీణ, మంచి దొంగ, సంఘర్షణ, దేవాంతకుడు, చాణక్య శపథం, యుద్ధభూమి, ధైర్యవంతుడు, ఛాలెంజ్, చిరంజీవి, ధర్మయుద్ధం చిత్రాలు మంచి విజయాలు సాధించాయి.

ఇక విజయశాంతి.. బాలయ్య కాంబోలో రౌడీ ఇన్స్‌పెక్టర్, లారీ డ్రైవర్, ముద్దుల మావయ్య, నిప్పురవ్వ, భార్గవ రాముడు, మువ్వ గోపాలుడు, అపూర్వ సహోదరులు, ముద్దుల కృష్ణయ్య, సాహస సామ్రాట్, భానుమతి గారి మొగుడు, ముద్దుల మేనల్లుడు, భలే దొంగ, ఇన్స్ పెక్టర్ ప్రతాప్, తల్లి తండ్రులు, దేశోద్ధారకుడు, పట్టాభిషేకం, రౌడీ రాణి, కథానాయకుడు, సంఘర్ష్ వంటి సినిమాలు రాగా, ఇందులో చాలా చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. మున్ముందు తాను సినిమాలు చేయనని విజయశాంతి స్టేట్ మెంట్ ఇవ్వడంతో అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రమే విజయశాంతికి చివరి చిత్రం అవుతుందా అనేది చూడాలి.


# హెచ్‌సీయూ విద్యార్థి విడుదల
## 16 రోజుల అనంతరం జైలు నుంచి బయటకు..

కొండాపూర్, ఏప్రిల్ 17 :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు సిద్ధమైన తరుణంలో.. తమ భూములు తమకేనంటూ పోరాటం చేసిన ఏబీవీపీ విద్యార్థి నాయకుడు రోహిత్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో 16రోజుల జైలు శిక్ష అనంతరం రోహిత్ గురువారం విడుదలయ్యారు. సంగారెడ్డి జైలు నుంచి విడుదలైన రోహిత్‌కు తోటి విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, భూముల వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. వర్సిటీ భూముల్లో చెట్లను నరకకుండా, భూములను లాక్కోకుండా ఎంతవరకైనా పోరాడుతామని తేల్చిచెప్పారు.



# వరుసగా మూడో రోజు ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా

అమృత్ తెలంగాణ: భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణ నిమిత్తం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రా ఇవాళ వరుసగా మూడోరోజు ఈడీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వెంట ప్రియాంక కూడా ఈడీ కార్యాలయం వరకు వెళ్లారు. కాగా ఈ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి వాద్రా ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించింది. నోటీసులు అందిన వెంటనే ఆయన నడుచుకుంటూ ఈడీ కార్యాలయానికి వెళ్లారు. దాదాపు ఐదు గంటలపాటు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. బుధవారం కూడా హాజరుకావాలని ఆదేశించడంతో ఆయన రెండో రోజు కూడా ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఇవాళ మూడో రోజు



కూడా విచారణకు వెళ్లారు. తన నివాసం నుంచి భార్య ప్రియాంకతో కలిసి వాద్రా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం లోపలికి వెళ్లిపోయారు. ఇదిలావుంటే ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్‌ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్‌ఎఫ్‌కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ విచారిస్తోంది.

# 'వక్ఫ్'పై తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: వక్ఫ్ సవరణ చట్టంపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది. వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయవద్దని, అలాగే సెంట్రల్ వక్ఫ్ బోర్డు, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించవద్దని ఆదేశించింది. వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటుపై సుప్రీంకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించి తమను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం రోజులు గడువు కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పివి సంజరు కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణ జరిగే వరకు వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని కేంద్రం తెలియజేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించొద్దని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది.

కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వుందన్నారు. ప్రభుత్వానికి లక్షల కొద్దీ మెమొరాండాలు, విజ్ఞప్తులు, అభ్యంతరాలు అందాయని, వాటి ఆధారంగానే తాము ఈ నిబంధనలను రూపొందించామని చెప్పారు. ఉదాహరణకు గ్రామాలకు గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించారని, ప్రజల వ్యక్తిగత ఆస్తులను కూడా అలాగే వక్ఫ్ ఆస్తులుగా తీసుకున్నారన్నారు. ఇది కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన చట్టం, ఇందులో పెద్ద సంఖ్యలో అమాయకుల భూ, ఆస్తి హక్కులకు సంబంధించిన అంశాలు వున్నాయన్నారు. ఇది ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కొన్ని పత్రాలతో సహా కోర్టుకు సమాధానం దాఖలు చేసేందుకు వారం రోజులు సమయం కావాలని కోరారు. ఈ అంశంపై వంద సంవత్సరాల కాలంలోని మొత్తం చట్టాల పరిధి, కొత్త చట్ట నిబంధనల రూపకల్పనకు దారితీసిన, దేశవ్యాప్తంగా అందిన అనేక మెమొరాండాలతో కలిపి మొత్తంగా ప్రభుత్వ స్పందన తెలియజేస్తామని మెహతా చెప్పారు. అప్పటి వరకు బోర్డు, కౌన్సిల్ నియామకం ఉండదని సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు.



ఈ సందర్భంగా సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి గణనీయమైన మార్పులు చోటు చేసుకోరాదని అన్నారు. కొత్త చట్టానికి ముందుగా వక్ఫ్‌లకు సంబంధించిన పరిస్థితుల్లో కొన్ని బలహీనతలు వున్నాయని చీఫ్ జస్టిస్ అన్నారు. 2025 చట్టంలోనూ కొన్ని సానుకూల అంశాలు వున్నాయన్నారు. ఈ చట్టంపై పూర్తిగా స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను కోర్టు బుధవారం తిరస్కరించింది. అదే సమయంలో ఈనాడు ఏవైతే పరిస్థితులు నెలకొన్నాయో వాటిని పూర్తిగా మార్చివేసేలా, పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేసేలా చేయాలనుకోవడం లేదని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. దానిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మళ్లీ స్పందిస్తూ, వారం రోజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, తాము చట్టంలోని సెక్షన్ 9, 14 కింద ఎలాంటి నియామకాలు చేపట్టబోమన్నారు. సిజెఐ జోక్యం చేసుకుంటూ తదుపరి విచారణ వరకు ఎలాంటి మార్పులు ఉండకూడదని చెప్పగా, ఎస్‌జి స్పందిస్తూ ఏ రాష్ట్రమైనా నియామకాలు చేస్తే చట్టబద్ధంగా పరిగణించకూడదన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఎస్‌జి వ్యాఖ్యలు రికార్డు చేసినట్లు పేర్కొంది. కౌన్సిల్, బోర్డులో ఎలాంటి నియామకాలు జరగవని ఎస్‌జి కోర్టుకు హామీ ఇచ్చారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణ వరకు ఎలాంటి నియామకాలు జరగకూడదని, వక్ఫ్ బై యూజర్‌గా పేర్కొన్న వాటితో పాటు నోటిఫికేన్ ద్వారా రిజిస్టర్ అయినవి, డీ నోటిఫై చేయకూడదంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేస్తూ, అప్పటి వరకు యథాతథ స్థితి కొనసాగుతుందని పేర్కొంది.

# హారికకు మెరుగైన చికిత్స అందించాలి
## అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 17అమృత్ తెలంగాణ: కుక్కల దాడిలో గాయపడి మూడు నెలలుగా కోమాలో ఉన్న బాలికకు మెరుగైన చికిత్స అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం నందికొండకు చెందిన హారిక కొద్ది రోజుల క్రితం ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన హరిక కోమాలోకి వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు దవాఖానల చుట్టూ తిప్పుతున్నప్పటికీ నయం కాలేదు. తండ్రి చనిపోవడం, తల్లి మాత్రమే ఉండి కడుపేద జీవితాన్ని గడుపుతున్న హారిక బాధలపై పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. జపాన్



పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పత్రికల్లో వచ్చిన వార్తకు స్పందించి.. బాలిక కుటుంబసభ్యులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. హారిక కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# ఓరుగల్లుకు దండై కదులుదాం

మేడ్చల్, ఏప్రిల్17.అమృత్ తెలంగాణ: రాష్ట్రమంతటా అతలాకుతలంగా ఉన్నదని, కరోనా ఉన్న సమయంలో కంటే కాంగ్రెస్ పాలన అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే మల్లారెడ్డి విమర్శించారు. గురువారం జవహర్‌నగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా వచ్చిన సమయంలో నైనా ఇంత అధ్వానంగా లేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ప్రజలు అన్ని రకాలుగా బాధలు పడుతున్నారన్నారు

మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్సే, మూడేండ్లు ఓపిక పట్టండి..మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ కావడం ఖాయం' అని అన్నారు. కాగా, జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలంటూ.. ఆహ్వాన పత్రికలను అందజేశారు.

# కళాశాల టాపర్లకు క్రీడా సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

## ఘనంగా కళాశాల వార్షికోత్సవం





అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ సన్మానిస్తున్న అధ్యాపకుల బృందం దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ లో కళాశాల క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ ఎంఎల్ఏ పాయల్ శంకర్ హాజరయ్యారు. కళాశాల మరియు విద్యారంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి నిరంతర ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె సంగీత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్చోడ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచ్చి శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ కుమార్ సాంస్కృతిక సమన్వయకర్త రడాపు సంతోష్ కుమార్ అధ్యాపకులు శ్రావణి జ్యోత్స్న రమాకాంత్ గౌడ్ చక్రవర్తి మంజుల అష్రఫ్ అలీ రాజ్ కుమార్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతల నడుమ విద్యార్థినులు నృత్యాలు చేశారు.

# మహిళల రక్షణకై ఆదిలాబాద్ షీ టీం బృందం

**మహిళలు, చిన్నారుల, విద్యార్థిని ల సమస్యలపై షీ టీం బృందాన్ని సంప్రదించాలి**

**ఆదిలాబాద్ పట్టణంలో యువతిని వేధిస్తున్న యువకుని పై కేసు నమోదు.**

**హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ కి రప్పించి షీ టీం స్పెషల్ ఆపరేషన్.**

**షీ టీం కొరకై 8712659953 నంబర్ని సంప్రదించాలి.**

**షీ టీం ఏఎస్ఐ బి సుశీల**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : మహిళల, విద్యార్థినుల రక్షణకై ఆదిలాబాద్ షీ టీం బృందం 24 గంటలు అప్రమత్తమై అందుబాటులో ఉంటూ విధులను నిర్వర్తిస్తుందని ఆదిలాబాద్ షీ టీం బృందం ఇంచార్జ్ బి సునీత తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి సంబంధించిన ఒక మహిళను హైదరాబాదులో చార్మినార్ వద్ద బట్టల దుకాణంలో పనిచేస్తున్న షేక్ రహీం s/o రఫిక్ అనే వ్యక్తి యువతి తో దిగిన ఒక ఫోటో ఆధారం చేసుకొని తనను సోషల్ మీడియా నందు తనపై దుష్ప్రచారం చేస్తూ, వేధిస్తూ, తనతో గడపాలని వేధిస్తూ ఉండడంతో యువతి ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని ఆశ్రయించింది, దీనికి స్పందించిన ఆదిలాబాద్ షీ టీం బృందం నేరస్థుని ఆదిలాబాద్ కి రప్పించి ఈరోజు ఉదయం స్థానిక ద్వారకా నగర్ వద్ద ఒక ప్రైవేటు లాడ్జి వద్ద పట్టుకొని అరెస్టు చేయడం జరిగింది. నేరస్థునిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 170/25 తో u/sec 77, 78(1)(2) BNS, 68(a) ఐ టి యాక్ట్ 2000 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు యువతులు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు ఉన్న మరియు పని ప్రదేశాలలో సమస్యలున్న కళాశాలలో వేధింపులకు గురైన ఆదిలాబాద్ షీ టీం బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించడానికి 8712659953 నంబర్ని సంప్రదించాలని తెలిపారు. ఈ ఆపరేషన్ నందు షీ టీం సభ్యులు పాల్గొన్నారు.




# జై బాపు జై భీమ్ జై సంవిధన్ జై జగత్ అవాకులు.. చెవాకులు పేలుతున్నబెవార్స్ ఆలియాస్ బిఆర్ఎస్ నాయకుల్లారా...!

అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : ప్రజలు ఇచ్చిన తీర్పులతో గుండు సున్నా ఫలితాలతో మెదడు కరాబై బెవార్స్ గుంపు వలే ఊర్ల మీద పడుతున్న బి.ఆర్.ఎస్ నాయకులను ఎండగంట్టండి. నీలదీయండి... ప్రజా ప్రభుత్వం పై అవాకులు చెవాకులు పేలితే తరమండి. బిఆర్ఎస్ అంటే ఇక బెవార్స్ గాళ్ల పార్టీ అని ప్రజలు అంటున్నారు. ఒరీ బెవార్స్ ఆలియస్ బిఆర్ఎస్ పార్టీ నాయకుల్లారా!

కాంగ్రెస్ పార్టీ అంటే త్యాగం.... ఈ దేశ ప్రజలకు...దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ..

వచ్చిన స్వాతంత్ర్య ఫలాలను పేదలకు,దక్కేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు. గారిబ్ హటావో..రాజభరణలు రద్దు..భూమల పంపకాలు..

అంబెద్కర్ వంటి మహానుభావునీతో రాజ్యాంగం రచన చేయడానికి కాంగ్రెస్ అవకాశం కల్పించింది.

రిజర్వేషన్లు వంటి వాటితో పేదల బతుకులలో మార్పు.పేద,ధనిక,కులం,మతం తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి ప్రజలను దేవుళ్ళను చేసిన ఘనత కాంగ్రెస్ ది.

ఇవాళ తెలంగాణ ఇచ్చిన పార్టీ అమ్మ సోనియమ్మ కరుణ తో కూడిన పార్టీ..
దేశంలో ప్రతి గ్రామానికి కరెంటు ఇచ్చింది ఎవరు??
దేశంలో ప్రతి పల్లెకి రోడ్డు వేసింది ఎవరు??
–ప్రభుత్వ పాఠశాలలు కట్టింది ఎవరు??
–ప్రభుత్వ కాలేజీలు కట్టింది ఎవరు?
-IIT,IIIT,NIT,AIMS లు కట్టింది ఎవరు??
–Tribal Universities కట్టింది ఎవరు??
–మెడికల్ కాలేజీలు కట్టింది ఎవరు??
దేశానికి కంప్యూటర్ ని పరిచయం చేసింది ఎవరు??
ప్రభుత్వ ఆసుపత్రులు కట్టింది ఎవరు??
–కోల్డ్ స్టోరజీలు కట్టింది ఎవరు ??
–ఎరువులపై సబ్సిడీలు ఇచ్చింది ఎవరు??
–రైతుల రుణాలు మాఫీ చేసింది ఎవరు??
–ప్రణాళిక సంఘం తెచ్చింది ఎవరు??
–హరిత విప్లవం తెచ్చింది ఎవరు??
–భాక్రానంగల్ ప్రాజెక్ట్ కట్టింది ఎవరు??
–బాబ్లీ ప్రాజెక్ట్ కట్టింది ఎవరు??
–నాగార్జున సాగర్ కట్టింది ఎవరు??
–శ్రీశైలం ప్రాజెక్ట్ కట్టింది ఎవరు??
–ఆలమట్టి కట్టింది ఎవరు??
ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని వందల ప్రాజెక్టులు!!
రైల్వేలు నిర్మించింది ఎవరు??
–విమానాశ్రయలు కట్టింది ఎవరు??
–కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రోడ్లు వేసింది ఎవరు??
–ఫ్లైఓవర్లు,బ్రిడ్జిలు కట్టింది ఎవరు??
–రింగు రోడ్లు వేసింది ఎవరు??
–మెట్రో తెచ్చింది ఎవరు??
–పోర్టులు కట్టింది ఎవరు??
–స్టీలు ఫ్యాక్టరీలు కట్టింది ఎవరు??
–బొగ్గు ఫ్యాక్టరీలు కట్టింది ఎవరు??
–జలవిద్యుత్ కేంద్రాలు కట్టింది ఎవరు??
–అణు విద్యుత్ కేంద్రాలు కట్టింది ఎవరు??
–క్లాత్ మిల్స్ తెచ్చింది ఎవరు??
–పారిశ్రామిక విప్లవం తెచ్చింది ఎవరు??
–పరిశ్రమలు తెచ్చింది ఎవరు??
–ప్రభుత్వరంగ సంస్థలు స్థాపించింది ఎవరు??
–ఉద్యోగాలు ఇచ్చింది ఎవరు?...

ఇవన్నీ మరచి కుక్క మూతి పిందెల్లా మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకుల్లారా.. సంతల్లో పశువులను కొన్నట్టు ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులను కొన్నటువంటి మీ పార్టీకి ..మీ అధినేత కేసీఆర్ కు ప్రజాస్వామ్యం పై గౌరవం ఉందా...?

ఎప్రిల్ 27న వరంగల్ లో మీటింగ్ అనిపది లక్షల మందితో మీటింగ్ అని గప్పాలు కొడుతున్న మీరు ఎన్నికల్లో నిలబడే ఎంపీటీసీలను,జెడ్పీటీసీలను.. మీకు బి ఫాం ఇస్తాం... మేమే డబ్బులిస్తామని.. మీరు మా పార్టీ తరఫున నిలబడాలని బ్రతిమలాడే స్థితికి దిగజారిన పార్టీ మీది.. ఇటువంటి మభ్య మాటలను ఎవరు నమ్మే పరిస్థితి లేకపోవడంతో కొత్త నాటకాలతో ముందుకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ మీకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద గుండు సున్నా ఫలితాలే...

ప్రజలు ఇసడించుకొని పాతాలంలో పాతర పెట్టిన పార్టీ మీ బెవార్స్ ఆలియాస్ బిఆర్ఎస్ పార్టీ మళ్లీ లేవదు గనుక లేవదు.. ఎందుకో ప్రజలు మిమ్మల్ని ఇంక వందేళ్లయిన మారచిపోలేని మోసాలు, పాపాలు,ఘోరాలు , నేరాలు,స్కాం లు,భూ దోపిడీలు చేసిన పార్టీ మీదని అనుభవంలోకి వచ్చిన తర్వాతనే కదా మీకు ,, మీ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల కుటుంబానికి దిమ్మ తిరిగే ప్రజా తీర్పుతో కర్రు కాలిచి వాత పెట్టి ఫాం హౌజ్ కే పరిమితం చేసింది మారచిపోతే ఎలా..?

దళిత ముఖ్యమంత్రి ఎమైంది..? ఇంటికో ఉద్యోగమంటిరి... డబుల్ బెడ్ రూమ్ అంటిరి... దళిత బిడ్డలకు మూడేకరాలు అంటిరి... 10 లక్షల దళిత బంధు అంటిరి.కేజీ టూ పీజీ అంటిరి..ఈ హామీలన్నీ గాలీ మాటలు చేసిన గారడీ పార్టీ



బిఆర్ఎస్ పార్టీ కదా...? అని ప్రజలు అడుగుతున్నారు.

1200 వందల మంది అమరవీరుల త్యాగంతో వారి సమాదులపై మీ పార్టీ పునాదులు వేసుకొని ఒక్కరినన్నా ఆదుకున్నారా..? అమరవీరుల కుటుంబాలను మోసం చేసిన నీచపు పార్టీ భారత దేశంలో ఏ పార్టీ అంటే మీ బెవార్స్ ఆలియాస్ బిఆర్ఎస్ పార్టీ అని ఎవరిని అడిగినా చెబుతారు.

ఇటువంటి దగుల్బాజీ గాళ్ల పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని కుట్రలు చేయడం.. ప్రజా ప్రభుత్వం ను కూల్చుతామని కుతంత్రాలు చేయడం... లేనీ సమస్యలను ఉన్నట్లు మీ పార్టీ ఆఫీస్ నుండే ఒక దొంగ సోషల్ మీడియా నడుపుకుంటూ... ప్రజలను రెచ్చగొట్టడం... తప్పా మీకు ప్రజలకు మంచి చేయడం చెతకాదు.. మీరు ఎన్ని చేసినా ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం చేస్తున్న డెవలప్మెంట్ ను అడ్డుకోలేరు. మీకు సాధ్యం కూడా కాదు.

గతంలో నమ్మీ మిమ్మల్ని నమ్మి పదేళ్లు అధికారం అప్పజెప్పితే ఎలా మోసం చేసారో ఇంకా పచ్చిగానే ఉండే ప్రజలు మీ మోసాలను ఎలా మరచిపోతారని అనుకుంటున్నారు...?

తెలంగాణ అమరుల త్యాగాన్ని సోనియమ్మ .. కాంగ్రెస్ పార్టీ గుర్తించి తెలంగాణ ఇచ్చింది. వట్టి తెలంగాణ కాకుండా ధనిక రాష్ట్రంగా తెలంగాణ ఇస్తే మీరు చేసిందేమిటీ..? అమరుల కోరుకున్న తెలంగాణ అపహాస్యం చేసింది మీరు కదా...?

ఇవాళ కాంగ్రెస్ పార్టీ మీరు అప్పుల పాలు చేసిన తెలంగాణ ను మా ప్రజా ప్రభుత్వం సరిదిద్దుతున్నది.. చక్కపెడుతున్నది... సంక్షేమాన్ని అందిస్తూ అన్ని వర్గాల ప్రజల మన్నలను పొందుతున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదా..? ఇంతటి అనుభావాలు మీ కనుల ముందున్నవి కాబట్టి ప్రజాలారా.. సామాజీక కార్యకర్తలారా.. తెలంగాణ మట్టిబిడ్డలారా... తెలంగాణ అమరవీరుల కుటుంబాల సభ్యులారా.... మళ్లీ ఈ బెవార్స్ ఆలియాస్ బిఆర్ ఎస్ పార్టీ మిడుతల దండు వలే దండు పాలేం దొంగల ముఠ వలే మన వరంగల్ ఊర్ల మీద పడటానికి వస్తున్నారు.

జాగ్రత్త... వీరి దొంగ మాటలు నమ్మితే మళ్లీ వీళ్లు మన బిడ్డల తలలమీద.. కడుపులో ఉన్న బిడ్డలపై కూడా 10 లక్షల అప్పును తల మీద బారం పెట్టి అన్యాయం చేసే ప్రమాదం ఉన్నది.. గమనించండి ప్రజలారా... రాష్ట్రం అదోగతి పాలౌతుందని కూడా గమనంలో పెట్టుకొండి. కేసీఆర్ మోసపు మాటలతో గారడి ఎత్తులతో ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ కుట్రలను.. మోసపు ఎత్తుగడలను పసిగట్టండి.. కాంగ్రెస్ పార్టీ కి అండగా ఉండండి.. ప్రజా ప్రభుత్వంను కాపాడుకొండి. కాంగ్రెస్ పార్టీ నాయకులారా... కార్యకర్తలారా.... మనం ఉంటున్న ప్రతి గ్రామంలో.. వాడలో.. కాలనీలో.. గూడెంలో.. ప్రతి గడపకు వెల్లాండి... కాంగ్రెస్ పార్టీ మన వాళ్ల .. మన ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వాటితో వారి జీవితాల్లో ఎటువంటి మేలు జరుగుంతుందో గుర్తింప జేయండి. మీటింగ్ పెట్టండి బిఆర్ఎస్ మాయ మాటలతో మోసపోయి వారి మీటింగ్ కు పోయేవారికి బిఆర్ఎస్ పాపపు, మోసపు చరిత్రను విడమరచి చెప్పండి. ఎవరన్న ఊర్లలోకి బిఆర్ఎస్ మిడతల గ్యాంగ్ వస్తే..వారి నేతలు వస్తే ఎండగట్టండి.. అడ్డుకొండి.. తరుమండి... కాంగ్రెస్ ప్రతి కార్యకర్త మన ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను... మన మూడు రంగుల జెండాను గుండె ల మీద పెట్టుకొని ముందుకు నడవండని.. ప్రజలతో మనం మమేకమౌతు ముందుకు పోదామని మీకు మనవి చేస్తున్నాం...

**జై కాంగ్రెస్ . జై రాహుల్ గాంధి.. జై భారత్.. జైజై తెలంగాణ....**
**ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ -నిర్మల్ జిల్లా )**

# ప్రభుత్వ పాఠశాల వంట గదిలో పురుగుల మందు కలిపిన వ్యక్తి అరెస్టు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

**మధ్యాహ్న భోజన వంట సామాగ్రికి పురుగుల మందు పూసిన వ్యక్తి అరెస్టు.**

**ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘటన.**

**టీచర్ అప్రమత్తతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.**

**ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు,విచారణ కొనసాగింపు.**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామం నందు ప్రాథమిక పాఠశాల లో ఆది సోమవారాలు సెలవు ఉండడంతో పాఠశాల పూర్తిగా మూసి వేయబడి ఉంది. మంగళవారం ఉదయం పాఠశాల భవనంలోని వంటగది తాళం పగలగొట్టబడి ఉండడంతో అందులో ఒక పాత్ర నందు బకెట్ నందు తెలుపు వర్ణంతో నీరు ఉండడం అదేవిధంగా వంటగది సామాగ్రికి విజిల్స్ కి ఆ అనుమానిత కలుషిత నీరు ఉండటంతో అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ సర్పంచిని, స్థానిక పెద్దలను విచారించగా అది పురుగుల మందు అని తేలడంతో టీచర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు విచారణ చేపట్టి అనుమానితుని అరెస్టు చేయడం జరిగింది. అనుమానితుడైన సోయం కిస్టు ధర్మపురి గ్రామం గోండు గూడ నివాసి ని విచారించగా తానే తన సోదరుడి ఇల్లు నిర్మల్ నుండి పురుగుల మందు తీసుకొని వచ్చి పాఠశాల వంటగది తాళాన్ని పగలగొట్టి ఇట్టి చర్యను చేపట్టినట్టు ఒప్పుకున్నాడని తెలియజేశారు. సోయం కిస్టు కుటుంబ కలహాల కారణంగా మానసికంగా ఆందోళనతో నిరాశతో ఉన్న విషయాన్ని తెలుసుకోవడం జరిగింది.ఇంట్లో వారి పై కోపం తో, ఇంటి నుండి బయటకు పంపకుండా పనికి పంపకుండా ఉండడంవల్ల ఇలాంటి చర్యలకు చేపట్టినట్టు తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 103/25 తో sec 329(4),324(6), 331(8), 332 BNS సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఘటన నందు పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని, ఘటనపై ఈరోజు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్ మరియు ఇచ్చోడ సిఐ భీమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు.



# ఆపదలో ఉన్నవారికి ఆస్పత్రి ఖర్చులకుఎంతో కొంత ఆర్థికలి సాయం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంకు చెందిన 40 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంకు వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రకారం నెరవేర్చాలని అన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలలో వెళ్ళినప్పుడు పూర్తిస్థాయిలో చికిత్స అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పథకాల అమలులో లబ్ధిదారులు మధ్యవర్తుల మాటలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉష్కం రఘుపతి ఆకుల ప్రవీణ్ కరుణాకర్ రెడ్డి. జోగు రవి. . అశోక్ రెడ్డి. భీం సన్ రెడ్డి. రాజేష్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న శాసనసభ్యులు పాయల్ శంకర్ పక్కన ఉష్కం రఘుపతి

# సమ్మర్ క్యాంప్ పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి సమ్మర్ క్యాంప్ శిక్షణ కార్యక్రమం లో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ ఛాంబర్ లో వేసవి శిక్షణ శిబిరం పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో వచ్చే నెల మే 1 నుండి మే 31, 2025వరకు 6 నుండి 14 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన బాలబాలికలకు , యువతకు వివిధ క్రీడలలో వేసవి క్రీడా శిక్షణ శిభిరాల ను నిర్వహించుటం జరుగుతుందన్నారు.మే 1 నుండి 31 వరకు ప్రతి రోజు ఉదయం 6.00గంటల నుండి 8.00గంటల వరకు , సాయంత్రం 5.00 గంటల నుండి 7.00గంటల వరకు ఆయా వివిధ రకాల క్రీడలలో నిర్వాహకులు శిక్షణ ఇస్తారున్నారు ఈ సందర్భంగా క్రీడా సామాగ్రిని కలెక్టర్ శిక్షణ నిర్వాహకులకు అందించారు క్రీడా శిభిరాల నిర్వహకులు/కోచ్లు వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని తమ తమ శిక్షణ శిభిరము వద్ద తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగు నీటి సౌకర్యాన్ని కల్పించి, ఓ.ఆర్.యస్., ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు తమ సమయాన్ని వృదాచేయకుండా శిక్షణ శిభిరాలకు హాజరై వారి ప్రతిభను వెలికితీసి సానబెట్టేందుకే రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శిభిరాలను నిర్వహిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను శిభిరాలకు పంపి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు గూగుల్ ఫాం ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారుఈ కార్యక్రమం లో dys వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియెట్ గణేష్, పార్థసారథి, డీఈఓ శ్రీనివాస్ కొచ్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతి చట్టం రైతుల చుట్టం

**భూమి హక్కులు భద్రం**
**భూ సమస్యల సత్వర పరిష్కారం**
**రైతుల మేలు కోసం ప్రజాపాలన లో చారిత్రక మార్పు**
**జిల్లా పాలనాధికారి రాజర్షి షా.**





హాజరైన ప్రజలు



భీంపూర్ మండలం గుంజాల గ్రామ శివారులో గురువారం నవోదయ స్కూల్ ఏర్పాటుకు జిల్లా పాలనాధికారి రాజర్షి షా స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అమలు పై జిల్లా లోని భీంపూర్ మండలం లో గురువారం భూ భారతి అవగాహన సదస్సు కార్యక్రమాన్ని జయ జయ హే తెలంగాణ పాట తో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భూ భారతి అవగాహన సదస్సు కార్యక్రమం లో భూ భారతి కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం పై తహసిల్దార్ ప్రియ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూ భారతి చట్టం పై సందేహాలను కలెక్టర్ కు వివరించిన అనంతరం తహసిల్దార్ వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ భూ భారతి చట్టం పై గ్రామస్తులు అందరికీ తెలుసుండాలని , అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

భూ భారతి కీలకాంశాలు

ధరణి స్థానం లో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, వారసత్వంగా వచ్చిన భూములను మ్యూటేశన్ చేసే ముందు నిర్ణీత కాలం లో విచారణ, భూమి హక్కులు ఏ విదంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు, పాసుపుస్తకాలలో భూమి పటం, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, భూదార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలకు, అబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ్ రెవెన్యు రికార్డుల నిర్వహణ, మోసపూరితనంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారాలు ఉంటాయని అన్నారు. భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూముల పై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూ భారతి చట్టం పై అవగాహనను కల్పించుకొని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, RDO వినోద్ కుమార్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డీ, తహసిల్దార్ ప్రియ, ప్రత్యేక అధికారి కిసాన్, DAO శ్రీదర్ స్వామి, మండల కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచ్ లింబాజి, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

# సోన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : గురువారం సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. పాఠశాలలోని ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ ప్రయోగశాలలో విద్యార్థులకు ఖగోళ శాస్త్రం, భౌతిక శాస్త్ర ప్రయోగాలు, మానవ శరీర ధర్మ శాస్త్రానికి సంబంధించి పరిజ్ఞానం పెంపొందించేలా వివిధ రకాల నమూనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన నమూనాల వల్ల ఆచరణాత్మక విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు అన్ని అంశాలు సులువుగా అర్థమవుతాయని తెలిపారు. ఈ ప్రయోగశాలను ఉపయోగించి పాఠశాలలోని విద్యార్థులందరికీ నైపుణ్యాలు పెంపొందించేలా ఆచారనాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని ఏ ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఇటువంటి ప్రయోగశాల లేదని అన్నారు. ఇటువంటి సదుపాయాలను కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల్లో పఠనాసక్తి, నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. కాగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేలా, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రత్యేక చొరవతో సుమారు 19 లక్షల 50 వేల రూపాయల ఖర్చుతో మొదటగా జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ప్రయోగ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిర్మల్ రూరల్ మండలం అనంత పేట్ కేజీబీవీ, మామడ మండలం పొన్కల్ ప్రభుత్వ పాఠశాల, తాండూరు మండలం బోసి ప్రభుత్వ పాఠశాల లో ఒక్కో పాఠశాలకు సుమారు 5 లక్షల చొప్పున వ్యయంతో ఈ ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి. రామారావు, సెక్టోరల్ అధికారి రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి వినోద్, తహసిల్దార్ మల్లేష్, ఎంఈఓ పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నిలదీతల నడుమ స్థలాల కేటాయింపు

కాసిపేట, ఏప్రిల్ 17 :అమృత్ తెలంగాణ: కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ భూ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెం వాసులకు ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహించిన స్థలాల కేటాయింపు కార్యక్రమం నిలదీతలు.. ఉద్రిక్తతల నడుమ సాగింది. దుబ్బగూడెం ఓపెన్ కాస్ట్ భూ నిర్వాసితులకు పెద్దనపల్లి గ్రామ పంచాయతీలోని బెల్లంపల్లి, కాసిపేట నూతన బైపాస్ రోడ్డులో స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు గురువారం ఆర్అండ్ఆర్ కాలనీలో ని కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థలాల పత్రా ల పంపిణీని ప్రారంభించారు. ఇంతలోనే భూ నిర్వాసితులు దూసుకొచ్చారు. 'అర్హులకు స్థలాలు కేటాయించకుండా.. అ నర్హులకు ఎలా ఇస్తారంటూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. దీం తో వెంటనే అప్రమత్తమై పోలీసులు వారిని నియంత్రించి బయటకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గలేదు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. సర్వే చేసి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. కాగా, పోలీసుల బందోబస్తు నడుమ మొత్తం 299 మందికి స్థలాల కేటాయింపు పత్రాలు అందించారు.

అనర్హులకు స్థలాలిచ్చారు..

స్థలాల పంపిణీలో అర్హులకు అన్యాయం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తాతల కాలం నుంచి ఇదే గ్రా మంలో ఉన్నామని, ఇండ్లు కూలిపోయే పరిస్థితి ఉండడంతో ఇతర చోట తలదాచుకున్నామన్నారు. దీంతో ఇక్కడ లేరని తమను తొలగించారన్నారు. కొంత మంది స్థానికంగా ఉన్నా స్థలాలు ఇవ్వలేదన్నారు. పూర్తిగా అర్హులైన తమకు స్థలాలు కేటాయించలేదని మండి పడ్డారు. కొందరు పరిహాసం కోసమే ఉండడానికి వీలు లేనివిధంగా ఇండ్లు కట్టుకున్నారని, వారికి కూడా స్థలాలు కేటాయించారని, గ్రామ కమిటీ కూడా కొంత మందితో కుమ్మక్కై తమకు అన్యాయం చేశారని మండిపడ్డారు.


# రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ నుండి అనుమతులు ఇవ్వండి

**అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ పై మంత్రితో చర్చ**



నిర్మల్ జిల్లా కుబీర్ ఏప్రిల్ 17 అమృత్ తెలంగాణ కుబీర్ మండలంలో చేపడుతున్న బీటి రోడ్ల పనులకు అటవీ శాఖ నుండి అనుమతిలివ్వాలని, అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వినతి పత్రాన్ని అందించారు. గురువారం ఆయన హైదరాబాదులో మంత్రిని కలిశారు. కుభీర్ నుండి దోదర్న, కుభీర్ నుండి తోటంబా, కుంటాల మండలంలో దౌనెల్లి నుండి మహారాష్ట్ర బార్డర్ వరకు చేపడుతున్న రోడ్ల నిర్మాణాల్లో కొంత ఫారెస్ట్ భూమి ఉందని, వాటికి అటవీశాఖ అనుమతి కావాలని, అధికారులు అడ్డుపడుతున్నారన్నారు. ప్రజా సౌలభ్యం కోసమే రోడ్ల నిర్మాణం జరుగుతుందని, తక్షణం అనుమతికై అటవీశాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ పై మంత్రితో కాసేపు చర్చించారు. అదేవిధంగా పలు సమస్యలను మంత్రికి విన్నవించారు.

# ఆధికారిక హింసకు చట్టబద్ధతనిచ్చే వ్యవస్థ




అమృత్ తెలంగాణ : భారతదేశంలో పోలీసుల అఘాయిత్యాలు, కస్టడీ హత్యలు, ఎన్‌కౌంటర్లు వంటి ఘటనలు నిత్యకృత్యమైయ్యాయి. దీనికి సంబంధించిన సమాచారాన్ని తరచూ వార్తలలో చూస్తున్నాము, చదువుతున్నాము. ఇటువంటి సందర్భంలో "పోలీసింగ్ అండ్ వాయిలెన్స్ ఇన్ ఇండియా" అనే పుస్తకం ముద్రితం అయ్యింది. ఇది సకాలంలో వచ్చిన బహుళ వివరణాత్మక గ్రంథంగా చెప్పుకోవచ్చు. ఈ పుస్తకానికి డీనా హీత్, జినీ లోకనీతా కలిసి సంపాదకీయులుగా ఉన్నారు. పోలీసు వ్యవస్థ ఎలా అణచివేతకు మారు పేరుగా మారిందో, ప్రజల రక్షణకోసం కాకుండా శాసనానికి మార్గం కల్పించేందుకు ఎలా తయారైందో అనే విషయాలను ఈ గ్రంథం చారిత్రకంగా, న్యాయపరంగా, రాజకీయ దృష్టి కోణంలో విశ్లేషిస్తుంది.

బ్రిటిష్ పాలనలో ఇండియన్ పోలీస్ యాక్ట్‌ను 1861లో ఏర్పాటు చేశారు. దాన్నే ఇప్పటికీ మార్చకుండా కొనసాగిస్తున్నారు. ఇటువంటి అంశాలను ప్రస్తావిస్తూ, భారతదేశంలో పోలీసు వ్యవస్థలోని వలస పునాదుల ప్రభావాన్ని పుస్తకం నొక్కి చెపుతుంది. ప్రజాస్వామ్య దేశంగా మారిన భారత్‌లోనూ పోలీసులు ప్రజల రక్షకులుగా కాకుండా, ప్రజలపై నిఘా పెట్టి, వారిని నియంత్రించే శక్తిగా పనిచేస్తున్నారు. ఈ చట్టం ఆధారంగా ఏర్పడిన వ్యవస్థలో, పోలీసులకు శిక్షణా విధానం, నిర్బంధం, శారీరక హింస సహజంగా మారాయని పుస్తకం ద్వారా తెలుస్తుంది.

2019లో నేషనల్ క్యాంపెయిన్ అగెయినస్ట్ టార్చర్ ఇచ్చిన నివేదిక ప్రకారం, ఆ సంవత్సరం దేశవ్యాప్తంగా 1,731 కస్టడీ మరణాలు చోటుచేసుకున్నాయి. అంటే ప్రతి రోజూ ఐదు మందికి పైగా నిందితులు పోలీసుల కస్టడీలో చనిపోతున్నారు. 2020లో జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ మరణాలలో 80 శాతానికి పైగా శారీరక హింసకు గురైనవే ఉన్నాయి. అయినప్పటికీ బాధ్యులపై గట్టిగా చర్యలు తీసుకునే సందర్భాలు అరుదేనని చెప్పాలి.

చాలా సందర్భాల్లో పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని, చట్టాన్ని ఉల్లంఘించినందుకు పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక వారికి చట్టపరంగా, డిపార్ట్మెంట్ పరంగా శిక్షలు కూడా లేవు. పైగా అవార్డులు, రివార్డులు దక్కుతాయి. ఈ మధ్య అన్ని భాషల్లో విడుదల అవుతున్న సినిమాల్లో చట్టాన్ని ధిక్కారించిన పోలీస్ హీరోలకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. ప్రజలు కూడా పోలీసులు చట్టాలు, కోర్టులు అంటూ కాలయాపన కంటే సత్వర న్యాయం కావాలని కోరుకొనేలా సినిమాలు వస్తున్నాయి. ప్రస్తుతం సినిమా హీరోలు కూడా స్మగ్లర్ల వేషాలతో ప్రజలు మన్నన పొందుతున్నారు.

అయితే ఈ పుస్తకంలో కశ్మీర్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ వంటి ఘర్షణాత్మక ప్రాంతాల నుంచే కాకుండా ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో కూడా పోలీసుల హింస ఎలా సర్వసాధారణమైందో వివరణాత్మకంగా ఉంది. పేదలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు పోలీసుల ఆగ్రహానికి ముఖ్యమైన లక్ష్యంగా మారుతున్న వాస్తవాన్ని పుస్తకంలో పరిశీలనాత్మకంగా రచయితలు తెలుపుతారు. ఇది వ్యక్తిగత విద్వేషం వల్ల కాదు, కానీ వ్యవస్థాపిత రీతిలో క్రిమినలైజ్ చేయబడిన సమాజ నిర్మాణమే ఇందుకు కారణమని రచయితలు విశ్లేషణాత్మకంగా తెలిపారు.


అసలు, పోలీసుల హింసను చట్టాలు ఏ విధంగా సమర్థిస్తున్నాయన్నది ఒక కీలక అంశం. ఉదాహరణకు యుఏపీఏ(అన్ లా ఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్), పబ్లిక్ సేఫ్టీ యాక్ట్, ఆర్మ్డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్ వంటి చట్టాలు ప్రజల రక్షణకే కాదు, దమనకాండకి మార్గం కల్పించడానికే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని రచయితలు వివరించారు. అంతేకాకుండా బాధితుల అనుభవాలు దీనిని నిరూపిస్తాయి. 2006కు సంబంధించిన ముంబయి రైలు బాంబు కేసులో అర్థంలేని ఆరోపణలతో అరెస్ట్ చేయబడిన అబ్దుల్ వహీద్ షేక్ తన అనుభవాలను ఈ పుస్తకంలో పంచుకున్నారు. పోలీసులు చేసిన హింస, న్యాయవ్యవస్థ నిర్లక్ష్యం గురించి ఆయన చెప్పిన విషయం వినడం తట్టుకోలేనిది.

ఈ సంకలన గ్రంథం పోలీసు సంస్కరణలను కేవలం పరిపాలనా సమస్యగా చూడదు. ఇది రాజకీయ వ్యవస్థలోని లోపాలను ఎదుర్కొంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నప్పటికీ భారత దేశం అధికారాన్ని భద్రపరచుకునే పేరుతో పోలీసు వ్యవస్థను నియంత్రణ సాధనంగా ఉపయోగిస్తోంది. 2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన ప్రకాశ్ సింగ్ తీర్పు ప్రకారం పోలీసుల పనులను విభజించడం, స్వతంత్ర పోలీస్ పర్యవేక్షణ మండళ్లు ఏర్పాటుచేయాలని ఆదేశించినప్పటికీ, చాలా రాష్ట్రాలు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యాయి.

ఇంకా పోలీసుల వృత్తి పరమైన సమస్యలను కూడా ఈ గ్రంథం ఉటంకిస్తుంది. 2019లో పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ బ్యూరో వెల్లడించిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 24 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 75 శాతం పోలీసులు రోజుకు 12 గంటలకు పైగా పని చేస్తున్నారు. అలాంటి స్థితిలో శిక్షణా లోపాలు, ఒత్తిడి, రాజకీయ వత్తిళ్లు, కుటుంబ సమస్యలు, సెలవులు దొరక్కపోవడంతో చికాకు, అసహనం, మానసిక ఒత్తిళ్ళు ఈ వ్యవస్థను మరింత భయానకంగా మారుస్తున్నాయి. పోలీసులలో రాక్షసత్వం పెరగటానికి పని పరిస్థితులు కూడా కారణమే.

ఇప్పుడు సమాధానం శిక్షణలతోనో సాంకేతిక పరికరాలతోనో సాధ్యపడదని రచయితలు అంటారు. ఇది ప్రజల హక్కులను గౌరవించేలా, బాధ్యత కలిగిన ప్రజాస్వామ్య పోలీసు వ్యవస్థగా మారాలంటే, వలస హింసా సంస్కృతిని పూర్తిగా తొలగించాల్సిందే.

స్వతంత్ర పర్యవేక్షణ, హింసపై గట్టి శిక్షలు, సామాజిక న్యాయంపై దృష్టి ఉండే విధంగా పోలీస్ వ్యవస్థను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది."పోలీసింగ్ అండ్ వాయిలెన్స్ ఇన్ ఇండియా" పుస్తకం ఒక విద్యావంతమైన అధ్యయనంగా మాత్రమే కాకుండా, భారతదేశపు ప్రభుత్వ యంత్రాంగానికి తమ ముఖాన్ని చూపించే అద్దంలా పనిచేస్తుంది. ప్రజాస్వామ్యం అనే మాటను గౌరవించాలంటే 'శాంతి కాపాడటానికి హింస అవసరం' అనే సూత్రాన్ని వ్యతిరేకిస్తూ సత్యం, న్యాయం, సమానత్వం అనే విలువలను సమర్థించాల్సిన అవసరం ఉందని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది.



అమృత్ తెలంగాణ బ్యూరో
సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,

# భూభారతి పై అగాన సదస్సు నిర్వహించిన తాసిల్దార్ సోమ శ్రీనివాస్,



బామ్ని బి లో భూభారతి పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న తహసిల్దార్,



రాంపూర్ లో భూభారతి అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు



రాంపూర్ భూభారతి అవగాహన కార్యక్రమంలో అధికారులు

అమృత్ తెలంగాణ: నర్సాపూర్ జి మండలంలోని రాంపూర్ బామ్ని గ్రామాల్లో గురువారం రైతులతో భూ భారతి ఆహ్వాన సదస్సులను నిర్వహించిన తాసిల్దార్ సోమ శ్రీనివాస్ ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు ఏమైనా ఉంటే భూభారతి చట్టం ద్వారా తాసిల్దార్ ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సుమలత, పంచాయతీ కార్యదర్శులు నవనీత్ కుమార్, గంగాజల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# నర్సాపూర్ జి బిజెపి మండల కార్యవర్గ సమావేశం......

## పాల్గొన్న బిజెపి మండల ఇన్చార్జి తక్కల రమణారెడ్డి,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఏప్రిల్ 17 అమృత్ తెలంగాణ నర్సాపూర్ మండల కేంద్రంలో బిజెపి మండల కార్యవర్గ సమావేశం. గురువారం పద్మశాలి సంఘంలో బిజెపి నూతన మండల కార్యవర్గం ఏర్పాటు కొరకు సమావేశంలో అభిప్రాయాలూ సేకరించి మండల ఇంచార్జీ తక్కల రమణ రెడ్డి,కి ఇవ్వడం జరిగింది. రమణ రెడ్డి, మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ కలిసి పార్టీ విజయం కోసం కృషి చేయాలనీ అన్నారు..ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి రాజేందర్, కౌన్సిల్ మెంబెర్ వినోద్ రెడ్డి, మాజీ సర్పంచ్ మహేష్, నాయకులు అర్జున్,దత్తురాం, గంగారాం, సవీన్, ప్రవీణ్ పటేల్, మహిపాల్, శ్రీకాంత్ రెడ్డి, సురేష్, సంజయ్ లు పాల్గొన్నారు...



బిజెపి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

# భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం దోహదం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్ చట్టంపై అవగాహన కల్పించేందుకు గురువారం నిర్మల్ గ్రామీణ మండలం న్యూ పోచం పాడ్ రైతు వేదికలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని వివరించారు. భూమి హక్కుల భద్రత, భూ సమస్యల వేగవంతమైన పరిష్కారానికి ఇది దోహదపడుతుందన్నారు. రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. భూ వివాదాల విషయంలో అప్పీల్ ప్రక్రియ ఉచిత న్యాయసహాయంతోపాటు, ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిల్లోనూ అప్పీల్స్ చేసే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. భూధార్ కార్డుల రూపంలో రైతులకు భూముల వివరాలు అందుబాటులో ఉ ంటాయని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌లో లేని సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. రికార్డులలో తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వ



మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

భూముల లాంఛనీకరణ, సాదా బైనామాల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సదస్సులో రైతులకు వివరించారు అంతకుముందు భూభారతి చట్టంపై అవగాహన కలిగేలా జిల్లా సమాచార పౌర సంబంధాలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సారధి కళాకారులు పాటల రూపంలో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. ఈ అవగాహనా సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

తాంసి, ఏప్రిల్ 17 :అమృత్ తెలంగాణ: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశాలతో వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు కౌడాల మహేందర్ పిలుపునిచ్చారు. సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వాల్‌రైటింగ్ కార్యక్రమాలు చేపట్టారు. రజతోత్సవ సభ విజయవంతం కావాలన్న లక్ష్యంతో మండలంలోని ప్రతి గ్రామంలో ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు హాజరై బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకుడు అశోక్, కార్యకర్తలు ఉన్నారు.

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను వియవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోర్వ శ్యామ్ పిలుపునిచ్చారు. ఈ సభ విజయవంతం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆయా కాలనీల్లో వాల్‌రైటింగ్ వేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన లక్షలాది మందితో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని హంగిర్గా గ్రామంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి వరంగల్ సభకు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్లాక్ లింగరీలో శర్మా గాళ్ దుమారం



నేహా శర్మ పరిచయం అవసరం లేదు. రామ్ చరణ్ చిరుత చిత్రంతో కథానాయికగా ఆరంగేట్రం చేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత తెలుగులో నటించలేదు. మొదటి సినిమాతోనే రామ్ చరణ్ తో ప్రేమలో పడిందని అందువల్ల తనకు తిరిగి ఇక్కడ అవకాశాలు రాలేదని కూడా అప్పట్లో ప్రచారమైంది. ఇటీవల తానాజీ లాంటి బ్లాక్ బస్టర్ లో నటించింది నేహాశర్మ. ఆ తర్వాత వరుసగా భారీ చిత్రాలకు కమిటైంది. అంతకుమించి వరుస ఫోటోషూట్లతో అభిమానులను కట్టి పడేస్తోంది. తాజాగా నేహాశర్మ ఇన్నర్ అందాల కవ్వింపు హాట్ టాపిక్ గా మారింది. బ్లాక్ బాడీకాన్ కటౌట్ డ్రెస్ లో నడుము అందాలను ప్రదర్శిస్తుంటే యూత్ గుండెల్లో గుబులు రేగుతోంది. నేహా టూ హాట్ గా కనిపిస్తోంది. క్రూక్- క్యా సూపర్ కూల్ హై హమ్- యమ్లా పగ్లా దీవానా 2- తాన్హాజీ సహా మరిన్ని హిందీ చిత్రాలలో నటించిన అందాల సుందరి నేహా శర్మ కు హాటెస్ట్ గాళ్ గా ఉన్న గుర్తింపు పెద్ద ప్లస్. ఈ గుర్తింపే అవకాశాలు తెస్తోంది. 34 ఏళ్ల ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. దాదాపు 14.8 మిలియన్ల మంది అనుచరులకు నిరంతర ఫోటోషూట్లతో ట్రీటిస్తోంది. టూపీస్ దుస్తులతో దుమారం రేపడం.. మినీ టాప్ లు.. బాడీ-హగ్గింగ్ స్కర్ట్ లతో ఊరించడం.. బికినీలతో హీటెక్కించడం నేహాకు కొత్తేమీ కాదు. అందమైన నెక్ లైన్ పుష్కలమైన స్కర్ట్ లో టోన్డ్ మిడ్ రిఫ్ ను ఆవిష్కరిస్తుంది.

శర్మ సిస్టర్స్ సందడే వేరు!

శర్మ సిస్టర్స్ ని విడి విడిగా చూడడం చాలా అరుదు. జిమ్ కి వెళ్లినా .. పబ్ కి వెళ్లినా .. మార్కెట్ కి వెళ్లినా లేదా ఇంట్లో సరదాగా సమయాన్ని గడిపినా.. ఒకరితో ఒకరు కలిసి ఎంతో ఫన్ ని క్రియేట్ చేస్తుంటారు. తన సోదరి నేహాశర్మతో కలిసి ఐషా శర్మ నిరంతర ఫోటోషూట్ల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు.నేహా ఫిట్నెస్ ఫ్రీక్. నిరంతరం తన సోదరితో జిమ్ కి వెళుతుంది. అభిమానులందరినీ ప్రేరేపిస్తుంది. ఓవైపు సినిమాల్లో వెబ్ సిరీస్ లలో నటిస్తూనే సిస్టర్స్ ఓటీటీలోనూ ప్రయోగాలు చేస్తున్నారు.

# నడుము నాభి అందాలు చూపిస్తూ రెచ్చగొడుతోంది


బాలకృష్ణ రూలర్ సినిమాతో పాటు పలు తెలుగు మరియు ఇతర భాష చిత్రాల్లో నటించిన ముద్దుగుమ్మ వేదిక ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇలా సందడి చేస్తోంది. సినిమాల్లో ఆఫర్స్ తక్కువ వస్తున్న కూడా సోషల్ మీడియా ద్వారా ఈ ముద్దుగుమ్మ తన అందాల ఆరబోతతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇలా నడుము నాభి అందాలని చూపిస్తూ కుర్రకారుకు మతి పోగొట్టే విధంగా ముద్దుగుమ్మ వేదిక ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు ఒకటి రెండు సినిమాల్లో నటిస్తున్నప్పటికీ వాటి వల్ల ఎంత వరకు ప్రయోజనం ఉంటుందో అనేది క్లారిటీ లేదు. అయినా కూడా సోషల్ మీడియాలో మాత్రం ఈమె రెగ్యులర్ గా నాభి నడుము అందాలను చూపించడంతో కుర్రకారు మతి పోగొడుతోంది. అందమైన వేదిక ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయినా ఇప్పటికి కూడా కొత్త హీరోయిన్ మాదిరిగా నాజూకు అందాలతో నడుము అందాలతో కుర్ర కారు మతి పోగొట్టుతుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాలీవుడ్ యంగ్ హీరోలు కాస్త ఈమె వైపు చూస్తే బాగుంటుందని.. తప్పకుండా యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా ఈమె మారే అవకాశం ఉంటుంది అంటూ నేటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. బాలకృష్ణ తో సినిమా చేసిన తర్వాత తెలుగులో కొన్ని ఆఫర్స్ వచ్చినా కూడా సున్నితంగా తిరస్కరించిందట ఈ అమ్మడు స్టార్ హీరోలకు జోడిగా నటించేందుకు ఆశపడుతోంది. ఇలాంటి అందాల



ఆరబోత చేస్తే ఇప్పుడు కాకుండా మరి కొన్నాళ్లకైనా తప్పకుండా యంగ్ స్టార్ హీరోలకు ఈమె వాంటెడ్ హీరోయిన్ గా నిలుస్తుందేమో చూడాలి.

# ఎంతకాలానికి పెళ్లి.. పిల్లల గురించి క్లారిటీగా మాట్లాడింది

గ్లామర్ ప్రపంచంలో హీరోయిన్ల ఆయుష్షు చాలా తక్కువగా చెబుతుంటారు. అయితే.. అలాంటి లెక్కల్ని తప్పుగా తేల్చేసిన బ్యూటీలు ఈ మధ్యన ఎక్కువ అవుతున్నారు. ఇండస్ట్రీకి వచ్చి.. ఒక వెలుగు వెలిగి.. అంతలోనే కనిపించకుండాపోయిన భామలకు భిన్నంగా ఏళ్లకు ఏళ్లు కంటిన్యూ అవుతున్న వారిలో మిల్కీ బ్యూటీ తమన్నా ఒకరు. అప్పుడు ఇప్పుడు మిల్కీ బ్యూటీ అన్నంతనే గుర్తుకు వచ్చే తమన్నా భాటియా.. పదమూడేళ్ల చిరు ప్రాయం నుంచే సినిమాల్లో నటిస్తోంది. ఇప్పుడు ఆమె వయసు 32 ఏళ్లపైనే. గ్లామర్ ప్రపంచంలో ఇంతకాలం కంటిన్యూ అవుతున్న అతి కొద్ది బ్యూటీల్లో తమన్నా ఒకరు. మిగిలిన హీరోయిన్ల మాదిరి గాసిప్స్ తన మీద రాకుండా ఆమె జాగ్రత్తలు తీసుకుంటుందని చెబుతారు. థర్టీకి దగ్గరకు వచ్చేసరికి హీరోయిన్లు పెళ్లిళ్లు చేసుకొని.. కాస్తంత గ్యాప్ ఇచ్చి



సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయటం ఈ మధ్యన చూస్తున్నాం. కానీ.. తమన్నా మాత్రం పెళ్లి ముచ్చటే తీసుకురాదు. అలాంటి ఆమె తాజాగా తన తీరుకు భిన్నమైన మాటల్ని చెప్పుకొచ్చింది. తాను పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పింది. పెళ్లికి సంబంధించిన ప్రస్తావనతో ఆపని ఆమె.. పిల్లల్ని కనాలనికూడా అనుకుంటున్నట్లు చెప్పి ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే.. పెళ్లి.. పిల్లల విషయాల్ని మాట్లాడేందుకు మక్కువ చూపని ఆమె.. ఇప్పుడు అందుకు భిన్నంగా ఒక్కసారిగా పెళ్లి.. పిల్లల్ని కనే విషయాన్ని తేల్చి చెప్పిన వైనం చూస్తే.. పెళ్లికి సంబంధించిన శుభవార్త త్వరలో షేర్ చేసుకోనుందా? అన్న సందేహం కలుగక మానదు.

# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఫ్రీజర్ లోంచి బయటపడి బతికిపోయింది....!



కోల్డ్ స్టోరేజ్ గొడౌన్ (ఫ్రీజర్) లో లాక్ అయిపోయిన ఒక అందమైన అమ్మాయి బతుకు పోరాటం నేపథ్యంలో 'మిలీ' అనే ఇంట్రెస్టింగ్ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. నిజఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. చలికి గడ్డకట్టిపోయే సన్నివేశంలో జాన్వీ కపూర్ ఎలాంటి పోరాటం సాగిస్తోందో ఇంతకుముందే ట్రైలర్ లో వీక్షించాం. గగుర్పొడిచే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో మిలీ ట్రైలర్ ఆద్యంతం రక్తి కట్టించింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com